క్లుప్తంగా

హిందువులందరూ సంఘటితంగా ఉండాలి


మాడ్చెట్‌పల్లిలో హనుమాన్ చాలీసాను అందజేస్తున్న శివశక్తి సంఘం బాధ్యులు

పెద్దశంకరంపేట(మెదక్): హిందువులందరూ సంఘటితంగా ఉండాలని శివశక్తి సంఘం నారాయణఖేడ్ అసెంబ్లీ ఇన్‌చార్జి శివాజీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాడ్చెట్‌పల్లిలోని హనుమాన్ దేవాలయానికి గీతా అలారం, యువకులకు హనుమాన్ చాలీసాలను అందజేశారు. కార్యక్రమంలో శివశక్తి సంఘం బాధ్యులు దుర్గేష్, గోపాల్, శివ, లింగం తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా చేయాలి


పనులను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని నోడల్ అధికారి విఠల్ తెలిపారు. శుక్రవారం చిలప్‌చెడ్, గంగారం గ్రామాల్లోని పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. జూన్ 5 వరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విశాల తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామశిల శోభాయాత్రకు ఆహ్వానం


ఆహ్వాన పత్రికలు అందిస్తున్న మహేశ్వర్‌శర్మ

కౌడిపల్లి(నర్సాపూర్): సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాది వద్ద గల శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో జూన్ 16న శ్రీనవాయతనరామ శిలాయాత్ర మహోత్సవానికి భక్తులు భారీగా తరలిరావాలని విద్యాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ మహేశ్వర్‌శర్మ సిద్ధాంతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం కౌడిపల్లితో పాటు సదాశివపల్లి, పాంపల్లి, బూరుగడ్డ, కంచన్‌పల్లి గ్రామాల్లో గ్రామస్తులకు భజన భక్తులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.ఈ సందర్భంగా మహేశ్వరశర్మ సిద్ధాంతిని భజన మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌడిపల్లి భజన మండల సభ్యులు డాక్టర్ పురుషోత్తం, రాజు, కృష్ణ, దుర్గయ్య, దశరథ, దుర్గాగౌడ్, ప్రతాప్‌రెడ్డి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.


జీలుగ విత్తనాల పంపిణీ


జీలుగ విత్తనాలను అందిస్తున్న ఏడీఏ

చేగుంట(తూప్రాన్): భూసారం కోసం రైతులు జీలుగ విత్తనాలు నాటుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ వసంతసుగుణ అన్నారు. చేగుంటలో శుక్రవారం ఏడీఏ రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్వింటాల్ జీలుగ విత్తనాలకు రైతులు రూ.3720 చెల్లించి తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో గాలి దుమారంతో అంధకారం

మండలంలో సుమారు 16 ఇళ్లకు నష్టం


దెబ్బతిన్న ఇల్లు

పాపన్నపేట(మెదక్): మండలంలో గురువారం సాయంత్రం వీచిన గాలి దుమారంతో సుమారు 16 ఇళ్లకు నష్టం జరిగింది. 20 కరెంట్ స్తంభాలు విరిగా పోగా, పలు చోట్ల చెట్లు విరిగి ఇళ్లపై పడ్డాయి. కరెంట్ వైర్లు తెగిపోయాయి. ఇళ్లపై రేకులు ఎగిరి పోయాయి. దీంతో మండలంలో విద్యుత్ సమస్య తలెత్తింది. రాత్రి 1 వరకు కొన్ని గ్రామాల్లో కరెంట్ సరఫరా పునరుద్ధరించినా, సగం గ్రామాలు, వాడల్లో కరెంట్ లేక బోర్లు నడవక, నీటి కోసం నానా తిప్పలు పడ్డారు. కోళ్ల ఫాంల్లో నీరు దొరకక కోళ్లు అల్లాడి పోయాయి. శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు పూర్తి స్థాయిలో కరెంట్ పునరుద్ధరించారు. కూలిపోయిన ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు.

మండుటెండల్లోనూ నిండుగా నీరు

మండు వేసవిలో భూగర్భజలాలు అడుగంటి పోతున్న తరుణంలో పురాతన చేతబావిలో నేటికి నిండుగా నీరు ఉంది. ప్రస్తుత కాలంలో చాలా మంది ఫిల్టర్ వాటర్ తాగుతున్నారు. కానీ శివ్వంపేట మండలంలోని దొంతి గ్రామ శివారులో రాతి గుట్టకు ఆనుకొని ఉన్న చేత బావి నీరును ఆ గ్రామస్తులు తాగుతుండటం విశేషం. – శివ్వంపేట(నర్సాపూర్)

- దొంతి రాతిగుట్ట వద్ద చేతబావి
- గ్రామస్తులకు పుష్కలంగా నీరు


రాతిగుట్టకు ఆనుకొని ఉన్న మంచినీటి చేతబావి


పుష్కలంగా కనిపిస్తున్న నీరు

వేసవిలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నా.. పురాతన చేతబావిలో నేటికి నీరు నిండుగా ఉంది. వందల ఫీట్ల లోతుల్లో బోరుబావి తవ్వకం చేపట్టిన పలుచోట్ల చుక్క నీరు పడని స్థితిలో 50 గజాల లోతులో ఉన్న పురాతన చేతబావిలో నీరు ఎండిపోకుండా పుష్కలంగా ఉన్నాయి. మండల పరిధిలోని దొంతి గ్రామ శివారులో రాతి గుట్టకు ఆనుకొని ఉన్న చేతబావి చరిత్ర ఘనమైంది. వందల ఏళ్ల క్రితం గ్రామ తాగునీటి అవసరాల కోసం గుట్ట పక్కన చేతబావిని తవ్వించారు. 50 గజాల లోతులో ఉన్న బావిలో ధారాళంగా నీటి ఊటలు ఉండడంతో నేటికి నీరు పుష్పలంగా ఉన్నాయి. బావి చుట్టూ బండ ఉన్న నీటి ఊటలు తగ్గిన సందర్భాలు లేవు.

బావిలో శివలింగం

బావి అడుగు భాగాన శివలింగం ఉండడం ఆ దేవుడు మహిమ వల్లనే పుష్కలంగా నీరు ఉంటున్నట్లు గ్రామస్తులు చెస్తున్నారు. బావి తవ్వినప్పటి నుంచి గ్రామం మొత్తానికి ఇక్కడి నుంచే నీటి వినియోగం జరిగేది. గ్రామానికి మిషన్ భగీరథ నీరు వస్తున్నప్పటికీ పలువురు గ్రామస్తులు మాత్రం ఈ చేతబావి నీటినే తాగేందుకు ఇష్టపడతారు. ఈ బావిలో మోటార్లు ఏర్పాటు చేయకుండా కేవలం బొక్కెన ద్వారా నీటిని తోడుకుంటారు. బావి 50గజాల లోతులో ఉండగా, 5 గజాల లోపే నీరు పైకి ఉండడంతో నీటిని చేదేందుకు సైతం గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండడం లేదు. మండు వేసవిలో సైతం పుష్కలంగా గ్రామానికి నీటి వసతిని కల్పిస్తున్న బావి ఉండడం గ్రామస్తులు అదృష్టంగా భావిస్తున్నారు. 500 ఫీట్ల లోతు బోరుబావులు తవ్విస్తున్న ప్రస్తుత తరుణంలో చుక్కనీరు రాని సందర్భాలు అనేకం ఉన్న ఈ చేతబావిలో మాత్రం నీటి దారలు పుష్కలంగా ఉన్నాయి. బావి తవ్వినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎండిపోయిన దాఖలు లేవని గ్రామస్తులు చెప్పారు.

కరువు వచ్చినా బావి ఎండిపోదు



గ్రామంలో ఉన్న ఈ మంచినీటి బావికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. తీవ్ర కరువు వచ్చిన రోజుల్లో కూడా ఈ బావి ఎండిపోలేదు. ఇలాంటి బావి మా గ్రామంలో ఉండడం మా అదృష్టం. – లక్ష్మీకాంతారావు, గ్రామస్తుడు

ఈ నీటినే తాగుతాం



ప్రస్తుతం మినరల్ వాటర్ అందుబాటులో ఉన్నా.. ఈ చేతబావి నీరు తాగేందుకు ఇష్టపడతాం. కరెంట్‌తో సంబంధం లేకుండా బొక్కెన ద్వారా నీటిని చేదుకుంటాం. – మంజుల, గ్రామస్తురాలు

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ


దంతేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): వాతావరణశాఖ అంచనాల మేరకు ఈసారి సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని దంతేపల్లి, పర్వతాపూర్ గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాల కొనుగోలు చేస్తున్న క్రమంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు లైసెన్సు ఉన్న వ్యాపారస్తుల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి విధిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. కొందరు దళారులు గ్రామాల్లో తిరుగుతూ ఎలాంటి ప్యాకింగ్ లేని విత్తనాలను అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వీరివద్ద విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టపోతారని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా విత్తనాలు, ఎరువులు అమ్మితే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. అధికారి వెంట మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి సాయికృష్ణ ఉన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కొల్చారం(నర్సాపూర్): ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను యథావిధిగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ ప్రభుత్వాన్ని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రైతు రుణమాఫీ, రైతుబంధుతో పాటు సన్న, దొడ్డు రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. ఇప్పటికే అకాల వర్షంతో రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వర్షాకాలం పంటల పెట్టుబడి, బ్యాంకుల ద్వారా రుణ సాయం అందించాలన్నారు. రైతులకు సబ్సిడీపై యంత్రాలు, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు రావాలని అన్నారు.

ఆచూకీ తెలపండి



హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన కప్పల సత్యనారాయణ ఏడు రెండు రోజులుగా కనిపించడం లేదని అతని భార్య నాగమణి, కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 17వ తేదీన సాయంత్రం ఇంట్లో నుంచి కామారెడ్డి జిల్లా తడ్వాయికి వెళ్లి వస్తానని చెప్పి ఇంత వరకు రాలేదని, దీంతో బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించడం లేదని, తన భర్త ఆచూకీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

నేటి నుంచి గ్రామాల్లో రైతు అవగాహన సదస్సులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 25 నుంచి 31 వరకు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఏఓ స్వప్న తెలిపారు. వర్షాకాలం పంటలు వేసేందుకు రైతులు విత్తనాల కొనుగోలు విషయంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల సాగు రైతుల సమస్యలపై అవగాహన సదస్సులు ఉంటాయని చెప్పారు. గ్రామాల వారీగా ఈనెల 25న కౌడిపల్లి, ధర్మాసాగర్, మహ్మద్‌నగర్, శేరితండా, తునికి, హరిచంద్‌తండా, 27న సదాశివపల్లి, బూరుగడ్డ, భుజిరంపేట, మనంతయపల్లితండా, వెంకట్రావ్‌పేట, రాయిలాపూర్, 28న కంచన్‌పల్లి, కొట్టాల, సలాబత్‌పూర్, పీర్లతండా, రాజిపేట, వెంకటాపూర్(ఆర్), 29న వెల్మకన్న, దేవులపల్లి, కూకుట్లపల్లి, కొత్తచెరువుతండా, ముట్రాజ్‌పల్లి, జాజితండా, 30న తిమ్మాపూర్, కుషన్‌గడ్డతండా, 31న నాగ్సాన్‌పల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులే ఉంటాయని చెప్పారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం


రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): సాధారణ పంటల సాగుకంటే ఆయిల్‌పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందని రాష్ట్ర కన్సల్టెంట్ బీ.ఎస్‌రావ్, లివింగ్ వుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి రంగనాయకులు, జిల్లా ఉద్యానవన అధికారి నర్సయ్య పేర్కొన్నారు. ఉద్యాన పట్టు పరిశ్రమ మెదక్ జిల్లా, లివింగ్ వుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మాసాయిపేట మండలం హకింపేట గ్రామశివారులోని లావణ్య ఆయిల్ ఫామ్ తోటలో ఉమ్మడి వెల్దుర్తి మండలంలో ఆయిల్‌పామ్ పంటలు సాగు చేస్తున్న సుమారు 90 మంది రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోరుబావులు ఉన్న రైతులు ఈ పంట సాగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగువిధానం, ఆయిల్ పామిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యానశాఖ రైతులకు అందించే రాయితీలపై వివరించారు. పంట సాగుకు అనుకూలమైన పరిస్థితులు, దిగుబడి వచ్చే విధానం, దిగుబడిని అమ్ముకునే విధానం, మార్కెటింగ్ సౌకర్యం, మొక్కకు ఇవ్వాల్సిన పోషకాలు, ఎరువులు, యాజమాన్య పద్ధతులు పామ్ గెలలు కోసం విధానం గురించి సవివరంగా వివరించారు. కార్యక్రమంలో నర్సాపూర్ డివిజన్ అధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారిణి రజిత తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని మహ్మద్‌నగర్‌లో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో మొక్కలకు ప్రతీ రోజు నీళ్లు పెట్టి ఏపుగా పెంచాలని చెప్పారు. నర్సరీల్లో చెత్త ఇతర పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని తెలిపారు. వర్షాకాలంలో నాటేందుకు వీలుగా మొక్కలు పెంచాలన్నారు. అనంతరం గ్రామ పంచాయితీలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


రాజు మృతదేహం

టేక్మాల్(మెదక్): అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం టేక్మాల్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ దయానంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గుంటి రాజు (30) ఈనెల 23న వడ్లను అమ్మేందుకు టేక్మాల్ గోదాంకు వచ్చాడు. వడ్ల వద్దనే ఉన్న రాజు మరుసటి రోజు శుక్రవారం వైన్స్ పరిసర ప్రాంతంలో విగత జీవిగా పడి ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి వెల్లారు. రాజు తరుచుగా తాగుతుంటే వాడని, అతని మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుడి తల్లి రాములమ్మ తెలిపింది. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ దయానంద్ చెప్పారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు టేక్మాల్ పోలీస్‌స్టేషన్ వద్దకు మృతదేహన్ని తీసుకెళ్లి మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని పోలీసులతో వాగ్వాదం చేశారు. కేసు దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తానని అల్లాదుర్గం సీఐ రేణుక హామీ ఇవ్వడంతో మృతదేహంతో బాధితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

◆ కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు



మనోహరాబాద్(తూప్రాన్): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు ప్రమాదం పొంచివుంది. మండలంలోని పర్కిబండ, గౌతోజీగూడెం, తుపాకులపల్లి గ్రామాల్లో రైతుల పొలాల మీదుగా ఉన్న విద్యుత్ తీగలు మనిషికి తగిలేలా ఉన్నాయని, పొలం దున్నే పరిస్థితిలు లేకుండా పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ ఎరువుల దుకాణం తనిఖీ



కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని మన గ్రోమోర్ ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ఏఓ స్వప్న శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో స్టాక్, ధరల పట్టికను పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రైతులకు నాణ్యమైన కల్తీలేని విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. స్టాక్, ధరల పట్టిక రైతులకు కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


రేగోడ్‌లో మాట్లాడుతున్న ఏఓ జావీద్


హవేళిఘణాపూర్‌లో మాట్లాడుతున్న ఏఓ

రేగోడ్(మెదక్): కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ జావీద్ హెచ్చరించారు. మండల కేంద్రం రేగోడ్‌లో శుక్రవారం ఫెర్టిలైజర్ దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులు, లైసెన్సులు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. స్టాక్, బిల్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. విత్తన ప్యాకెట్లపై లేబుళ్లను పరిశీలించి.. గడువు దాటిన విత్తనాలను అమ్మకూడదని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై సీడ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్ హెచ్చరించారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు విక్రయించే సమయంలో రైతుల పేర్లు రికార్డులో నమోదు చేయాలని తెలిపారు. అలాగే రైతులకు విత్తనాలకు లాట్ నంబర్‌తో రశీదు అందించాలని సూచించారు. ఏఈఓలు శ్రీనివాస్ ఉన్నారు.

హవేళిఘణాపూర్‌లో..

హవేళిఘణాపూర్(మెదక్): కాలం చెల్లిన విత్తనాలు విక్రయించిన ఫర్టిలైజర్ దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని ఏఓ నాగమాధురి అన్నారు. మండల కేంద్రం హవేళిఘణాపూర్ రైతు వేదికలో మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో యాసంగి సీజన్‌కు సంబంధించిన విక్రయించే విత్తనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని ఫర్టిలైజర్ దుకాణ యజమానులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు


గ్రామంలో పల్లకీసేవ చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం స్వామివారికి ఆలయ అర్చకుడు వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. సాయంత్రం పొన్నసేవ మహోత్సవం, గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకీసేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం మోహిని సేవ జరుగుతుందని ఆలయ అర్చకుడు వేణు గోపాలశర్మ తెలిపారు.

వెంకటాయిపల్లిలో ధాన్యం సేకరణ పూర్తి

- నిర్వాహకులకు సన్మానం


ఆర్డీఓ కార్యాలయంలో ఐకేపీ సిబ్బందిని సన్మానిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: ధాన్యం సేకరణలో పూర్తి చేసిన తూప్రాన్ మండలంలోని వెంకటాయిపల్లి ఐకేపీ సెంటర్ ప్రథమ స్థానంలో నిలిచిందని ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో సెంటర్ ఇన్‌చార్జి రేఖ, వీఓఏ లత, ట్యాబ్ ఎంటర్ సభ్యురాలు శ్రీలతలను తహసీల్దార్ విజయలక్ష్మిలతో కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. మెదక్ డిస్టిక్‌లోనే మొదటగా ఈ నెల 11 నాటికి మొత్తం ధాన్యం 3,072 క్వింటాల వడ్లు కొనుగోలు చేసి, ట్యాబ్ ఎంట్రీ చేసి 98 రైతులకు 98 మంది రైతులకు డబ్బులు జమ చేసి సెంటర్ క్లోజ్ చేసినందుకు సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఐకేపీ ఏపీఎం రుక్మిణీ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- మెదక్ ఆర్డీవో రమాదేవి


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

రామాయంపేట(మెదక్): తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి ఆదేశించారు. ఆమె శుక్రవారం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె తహసీల్దార్ రజనీకుమారితో కలిసి సమావేశంలో మాట్లాడుతూ.. కార్యాలయానికి వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలని, విధి నిర్వహణ విషయమై నిర్లక్ష్యం వీడాలని ఆదేశించారు. ధరణి, ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. మండల పరిధిలోని శివ్వాయపల్లిలో కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు వేగవంతం చేయాలని అన్నారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా చూడాలని, ధాన్యాన్ని వెంట వెంట రైసుమిల్లులకు తరలించాలని తెలిపారు.

ఉపాధి కూలీల ఆందోళన

శివ్వంపేట(నర్సాపూర్): చేసిన పనికి తగిన కూలీ డబ్బులు ఇవ్వకుండా పని చేయని వారి పేర్లు నమోదు చేసి డబ్బులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉపాధిహామీ కూలీలు ఆందోళన చేశారు. మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో జాతీయ ఉపాధిపని చేసిన వారికి కాకుండా ఇతరులకు డబ్బులు జమ కావడంపై శుక్రవారం ఉపాధి కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల నుంచి కూలీలు చేసిన పనులకు సంబంధించి కొలతలు సక్రమంగా చేయకుండా డబ్బులు తక్కువ ఇస్తున్నారని వాపోయారు. పనిచేయని వారి పేరిట రికార్డులు నమోదు చేసి, వారికి కూలి డబ్బులు వచ్చాయన్నారు. ఇళ్ల వద్ద ఉన్న పలువురు వృద్ధుల పేరిట డబ్బులు ఎలా జమ అయ్యాయని ప్రశ్నించారు. గ్రామానికి ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో మెట్‌లు, కార్యదర్శి కలిసి చేసిన పనికి సంబంధించి సక్రమంగా రికార్డులు నమోదు చేయకపోవడం వల్లనే నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయం తెలుసుకున్న ఏపీఓ అనీల్, టీఓ మన్సూర్ గ్రామానికి చేరుకున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి కూలీలకు న్యాయం చేస్తామని ఏపీఓ హామీ ఇవ్వడంతో కూలీలు శాంతించారు.


ఆందోళన చేస్తున్న కూలీలు

ధాన్యం తరలింపులో ప్రభుత్వం విఫలం

- ఎంపీపీ కల్లూరి హరికృష్ణ


మాట్లాడుతున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం సక్రమంగా తరలింపులో ప్రభుత్వం విఫలం అయిందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం 15 రోజుల అవుతున్నా.. తూకం వేయకుండా తరలించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులకు ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. లారీల్లో తరలిస్తున్న ధాన్యం వెయిటింగ్ పేరిట బస్తాకు రూ.3 రూపాయల నుంచి రూ.5 రూపాయలు రైతులు నుంచి వసూలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌రెడ్డి, కొండల్, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.